# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 14-07-2026** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

**1) రాజధాని అమరావతి నిర్మాణంలో వివిధ రంగాల్లో సహకారం అందించేందుకు సంసిద్ధత వ్యక్తం చేసిన సింగపూర్ ప్రభుత్వ ప్రతినిధులు.**

**2) వియత్నాం బోటు ప్రమాదంలో మరణించిన వారి మృతదేహాలను స్వస్థలాకు తరలించిన రాష్ట్ర ప్రభుత్వం.**

**3) వైఎస్సార్ కడప జిల్లాలో దాల్మియా సిమెంట్ పరిశ్రమలో 3 వేల కోట్ల రూపాయలతో చేపట్టే విస్తరణ పనులకు రేపు శంకుస్థాపన చేయనున్న రాష్ట్ర విద్య, ఐటీ, శాఖల మంత్రి నారా లోకేష్ .**

**4) రాష్ట్రంలో రెండవ విడత ఉద్యోగ నియామకాలకు జాబ్ కేలండర్‌ను రూపొందించేందుకు ప్రభుత్వం కసరత్తు.**

======================

సింగపూర్ ప్రభుత్వ ప్రతినిధులతో రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ సమావేశం అయ్యారు. అమరావతి సచివాలయంలో ఈరోజు జరిగిన సమావేశంలో సింగపూర్ ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ మంత్రిత్వ శాఖ సీనియర్ డైరెక్టర్ ఫ్రాన్సిస్ చాంగ్, సింగపూర్ కో ఆపరేషన్ ఎంటర్ప్రైజ్ ప్రతినిధులు పాల్గొన్నారు. రాష్ట్ర రాజధాని అమరావతి నిర్మాణంలో వివిధ రంగాల్లో సహకారం అందించేందుకు సింగపూర్ ప్రతినిధులు సంసిద్దత వ్యక్తం చేశారు. వివిధ ప్రాజెక్టుల నిర్మాణంలో సింగపూర్ నిపుణుల అనుభవాలు, సాంకేతిక పరిజ్ఞానం,శిక్షణతో పాటు సలహాలు, సూచనలను సింగపూర్ ప్రభుత్వం అందించనుంది.

--------------------------

వియత్నాంలో బోటు ప్రమాదంలో చనిపోయిన వారి మృతదేహాలు ఈరోజు ఉదయం హైదరాబాద్ శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకున్నాయి. మృత దేహాలను ఎయిర్ పోర్టు నుంచి ప్రత్యేక అంబులెన్స్‌ల ద్వారా వారి స్వస్దలాలకు పంపిస్తున్నామని రాష్ట్ర ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ చెప్పారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్, భారత, వియత్నాం విదేశాంగ శాఖ అధికారులతో మాట్లాడి మృతదేహాలు త్వరగా భారత్ వచ్చేందుకు కృషి చేశారని మంత్రి తెలిపారు. వియత్నాం బోటు ప్రమాదంలో రాష్ట్రానికి చెందిన చెందిన ముగ్గురు పర్యాటకులు మృతిచెందారు. మృతుల కుటుంబ సభ్యులను

మంత్రి శ్రీనివాస్ పరామర్శించారు. మృతదేహాలను అంబులెన్స్‌ల్లో వారి స్వస్థలాలకు తరలించిన అనంతరం పాత్రికేయులతో మంత్రి శ్రీనివాస్ మాట్లాడుతూ ........

..వాయిస్...25 సెకన్లు

---------------------------

విశాఖ పట్నంలోని జంతు ప్రదర్శన శాల అభివృద్ధికి రాష్ట్ర బడ్జెట్‌లో ప్రాధాన్యతినివ్వాలని శాసన సభాపతి, ఆంధ్రప్రదేశ్ శాసన సభ వన్యప్రాణి, పర్యావరణ పరిరక్షణ కమిటీ చైర్మన్ సీహెచ్ అయ్యన్నపాత్రుడు ప్రభుత్వాన్ని కోరారు. ఈరోజు ఆయన సంఘ సభ్యులతో కలిసి విశాఖ జూను సందర్శించారు. ఈ సందర్భంగా అయ్యన్న పాత్రుడు మాట్లాడుతూ.... ఏటా 3 కోట్ల రూపాయల సీఎస్సార్ నిధుల ద్వారా నైనా జూ ను అభివృద్ధి చేయాలన్నారు. ఉత్తరాంధ్రకు చెందిన పార్లమెంట్ సభ్యులు కూడా తమ ఎంపీ ల్యాడ్స్ నిధుల్లో 10 శాతం జూ అభివృద్ధికి కేటాయించాలని అయన్నపాత్రుడు కోరాలన్నారు.

---------------------------

రాష్ట్రంలో ఓటర్ల జాబితా సవరణ –ఎస్ఐఆర్– ప్రక్రియలో భాగంగా ఓటర్లు తమ వివరాలను నింపిన ఎన్యూమరేషన్ పత్రాలను బీఎల్‌వోలకు ఇవ్వాటానికి ఈరోజే చివరి రోజు. ఈరోజు పూర్తిచేసిన ఎన్యూ మరేషన్ పత్రాలు బీఎల్ వోలకు ఇవ్వకపోతే జులై 21న విడుదలయ్యే ముసా యిదా జాబితాలో ఓటరు పేరు ఉండదు. ఇప్పటికే బీఎల్ వోలకు ఎన్యూమరేషన్ పత్రం సమర్పించి ఉన్న ఓటర్లు.... దాన్ని అధికారులు పోర్టల్‌లో అప్లోడ్ చేసి డిజిటలైజ్ చేశారో లేదో ఈసీఐ నెట్ యాప్ లేదా voters.eci.gov.in వెబ్‌సైట్ ద్వారా పరిశీలించొచ్చు.

---------------------------

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన ఈ రోజు మధ్యాహ్నం అమరావతి సచివాలయంలో రాష్ట్ర నెలవారీ ఆర్థిక నివేదిక పై ప్రత్యేక సమావేశం జరగనుంది. సచివాలయంలోని ఐదవ బ్లాక్‌లో జరిగే ఈ సమావేశంలో అన్ని శాఖల ప్రత్యేక కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులతో సహా పలువురు ఉన్నతాధికారులు హాజరుకానున్నారు.

---------------------------

వైఎస్సార్ కడప జిల్లాలో దాల్మియా సిమెంట్ పరిశ్రమలో 3 వేల కోట్ల రూపాయలతో చేపట్టే విస్తరణ పనులకు రాష్ట్ర విద్య, ఐటీ, శాఖల మంత్రి నారా లోకేష్ రేపు శంకుస్థాపన చేయనున్నారు. వైఎస్సార్ కడప జిల్లా మైలవరం మండలం చిన్నకొమెర్లలో ఉన్న దాల్మియా సిమెంట్ భారత్ లిమిటెడ్ లో చేపట్టే విస్తరణ పనులను రాష్ట్ర ప్రభుత్వ పారిశ్రామిక విధానాలు, ప్రోత్సాహకాలతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు సంస్థ నిన్న విడుదల చేసిన ఒక ప్రకటనలో వెల్లడించింది. సిమెంట్ ప్లాంట్ విస్తరణ ద్వారా ఉత్పత్తి సామర్థ్యం భారీగా పెరగనుంది. ప్రస్తుతం ఈ ప్లాంట్ ద్వారా 950 మందికి ఉపాధి లభిస్తుండగా, విస్తరణ అనంతరం మరో 700 మందికి ప్రత్యక్ష ఉపాధి లభించనుంది. విస్తరణ తర్వాత ప్రభుత్వానికి ప్రతి ఏటా 315 కోట్ల రూపాయలు రాయల్టీ, జీఎస్టీ రూపంలో ఆదాయం రానుందని సంస్థ తెలిపింది.

---------------------------

రాష్ట్రంలో రెండవ విడత ఉద్యోగ నియామకాలకు జాబ్ కేలండర్‌ను రూపొందించేందుకు వివిధ శాఖల

కార్యదర్శులు, శాఖాధిపతులతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి.సాయి ప్రసాద్ నిన్న సమావేశం నిర్వహించారు. అమరావతి సచివాలయంలో జరిగిన ఈ సమావేశంలో రెండవ దశ జాబ్ కేలండర్‌కు సంబంధించి భర్తీ చేయాల్సిన పోస్టుల నోటిఫికేషన్, అందుకు సంబంధించిన పలు సాంకేతిక అంశాలపై అధికారులు చర్చించారు. ఈ ప్రక్రియను నిర్దిష్ట వ్యవధి ప్రకారం సకాలంలో పూర్తి చేయాలని కార్యదర్శులు, హెచ్ఓడిలను ఆదేశించారు.

---------------------------

కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న బీమా పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని అనంతపురం జిల్లా కెనరా బ్యాంక్ రీజినల్ మేనేజర్ శ్రీనివాసులు తెలిపారు. అనంతపురంలోని కెనరా బ్యాంక్‌లో ఈరోజు ఆయన ప్రధానమంత్రి జీవన్ జ్యోతి, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన కు సంబందించి 4 లక్షల రూపాయల చెక్కు ను లబ్ధిదారుల కుటుంబానికి అందజేశారు. జిల్లా వ్యాప్తంగా ప్రమాద బీమా పథకాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని శ్రీనివాసులు తెలియచేస్తూ ...

వాయిస్...27 సెకన్లు

---------------------------

నీటి సంరక్షణ, నిర్వహణతో పాటు, ముఖ్యంగా వర్షపు నీటిని సద్వినియోగం చేసుకోవడానికి కేంద్ర జలశక్తి అభియాన్ వర్షపునీరు ఒడిసిపట్టే "క్యాచ్ ది రైన్" అనే కార్యక్రమాన్ని చేపట్టింది. దేశవ్యాప్తంగా అనేక జిల్లాలలో ఈ ప్రచారాన్ని నిర్వహిస్తోంది. ప్రజలు వర్షపు నీటిని సేకరించి, భవిష్యత్తులో ఉపయోగించుకునేలా ప్రోత్సహించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. ఇందులో భాగంగా వాతావరణ మార్పుల ద్వారా పెరుగుతున్న నీటి కొరత నేపథ్యంలో నీటి భద్రత, వర్షపు నీటి సంరక్షణ, భూగర్భ జలాల పునరుజ్జీవనం ప్రాముఖ్యతపై పలు అవగాహనా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

---------------------------

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఈరోజు విశాఖపట్నంలో పర్యటిస్తున్నారు. ఇటీవల సముద్రంలో జరిగిన బోటు ప్రమాదంలో మరణించిన ఆరుగురు మత్స్యకారుల కుటుంబాలను ఆయన పరామర్శిస్తున్నారు. ప్రమాదం నుంచి బయటపడి ఒడ్డుకు చేరుకున్న కారి చిన్నా అనే మత్స్యకారుడిని జగన్ మోహన్ రెడ్డి కలవనున్నారు.

---------------------------

రాష్ట్రంలో మత్స్యకారుల సంక్షేమానికి 'మత్స్యకారుల సేవలో' కార్యక్రమం కింద రాష్ట్ర ప్రభుత్వం 11.82 కోట్ల రూపాయలు మంజూరు చేసింది. 2026-27 ఆర్థిక సంవత్సరానికి సముద్ర వేట నిషేధ కాలంలో మత్స్యకారుల భృతికి ఈ నిధులు ఖర్చు చేయనున్నట్లు నిన్న విడుదల చేసిన ఒక ప్రకటనలో అధికారులు తెలిపారు. ఈ పథకం కింద మొదటి విడతలో 1 లక్షా 28 వేల 388 మంది మత్స్యకార కుటుంబాలకు 256.776 కోట్లు విడుదల చేయగా, రెండో విడతలో వివిధ కారణాల వలన మిగిలిన 5 వేల 910 మంది మత్యకారులకు ఈ నిధులు పంపిణీ చేయనున్నారు. సముద్ర వేట నిషేధ కాలంలో ఉపాధి కోల్పోయే మత్స్యకార కుటుంబాలు ఎలాంటి ఆర్థిక ఇబ్బందులు పడకుండా ఉండేందుకు ప్రభుత్వం ఈ భృతిని అందిస్తోందని అధికారులు తెలిపారు.

---------------------------

విజయనగరం జిల్లా భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి కేంద్ర హోంశాఖ కీలక గుర్తింపు ఇచ్చింది. ఇమిగ్రేషన్, విదేశీయుల చట్టం-2025 పరిధిలోకి ఈ ఎయిర్ పోర్టును చేర్చింది. ఈ మేరకు కేంద్ర కేంద్రహోంశాఖ అదనపు కార్యదర్శి నితేశ్ కుమార్ వ్యాస్ పేరిట అధికారిక ఉత్తర్వులు వెలువరించింది. దీంతో కేటగిరీ-1 విమానాశ్రయాల జాబితాలో భోగాపురం 39వ స్థానంలోకి చేరింది. కేంద్ర హోంశాఖ నిర్ణయంతో ఈ విమానాశ్రయం నుంచి అంతర్జాతీయ విమానాల రాకపోకలకు మార్గం సుగమం కానుంది.

======================